క్లుప్తంగా

ఎస్సైకి సన్మానం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి పోలీసుస్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఎస్సై వెంకటేశ్వర్లను ఆదివారం ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు కలిశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలసి ఎస్సైని సన్మానించారు. కార్యక్రమంలో వెంకాగౌడ్, కిషన్‌రావు, రాజయ్య, నవీన్, లింగం, సురేష్ తదితరులున్నారు.

హాస్టల్ ఆవరణలో పశువుల కొట్టాలు



బాన్సువాడ రూరల్ : మండల కేంద్రంలోని బంజార భవన్‌లో కొనసాగుతున్న ఎస్టీ బాలికల కళాశాల వసతి గృహం పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. హాస్టల్ భవనానికి ఆనుకుని గేదెలు కట్టి ఉంచడంతో బురదమయంగా మారింది. ఈగలు, దోమలు వృద్ధిచెంది దుర్గంధం వ్యాపిస్తోందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉతికిన బట్టలు ఆరేసుకోవాలన్నా ఇబ్బందిగా మారిందన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో తరచూ విద్యార్థినులు రోగాల బారిన పడ్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి పశువుల పెంపకందారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొత్తాబాదిలో ఉచిత వైద్య శిబిరం



బాన్సువాడ రూరల్ : మండలంలోని కొత్తాబాది గ్రామంలో ఆదివారం సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఓమేగా ఫైర్ ప్రేయర్ హోల్‌చర్చి పాస్టర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ నరేందర్, డాక్టర వాగ్దేవి సుమారు 150మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో పాస్టర్లు జోసేఫ్ ఆంటోని, ఎలిజబెత్ రాణి రోస్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీడీపీవో కార్యాలయాన్ని నిర్మించాలి



ఎల్లారెడ్డి : శిశుసంక్షేమ శాఖకు సంబంధించి ఎల్లారెడ్డిలో సీడీపీవో కార్యాలయం భవనాన్ని నిర్మించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు ఆదివారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. ఎల్లారెడ్డి డివిజన్‌కు సంబందించి సీడీపీవో కార్యాలయ భవనం పట్టణంలోని ఇతర శాఖకు సంబంధించిన కార్యాలయంలో కొనసాగుతోందని, సీడీపీవో కు సంబంధించిన భవనాన్ని నిర్మించేలా చర్య లు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దుర్గ, సాయవ్వ తదితరులున్నారు.

ఉత్సవాల కమిటీ ఎన్నిక



బాన్సువాడ : వచ్చే నెలలో నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఇన్‌చార్జిగా అయ్యాల సంతోష్, అధ్యక్షుడిగా ఎర్రవటి పోశీరాం, గౌరవ అధ్యక్షుడిగా అయ్యాల ఆనంద్, ఉపాధ్యక్షులుగా వినోద్‌కుమార్, సాయన్న, మోచి మోహన్, సతీష్, లాలూ, రాములు, ప్రధాన కార్యదర్శిగా పాండురంగం, సహాయ కార్యదర్శిలుగా గైని పండరి, గంగారం, బంగారు రవి, లక్ష్మణ్, కోశాధికారిగా హన్మాండ్లు, సలహాదారులుగా బాల్‌రాజ్, బంగారు మైశయ్య, కాదేపురం గంగాధర్, విఠల్, సాయిలు, సంగమేశ్వర్, బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ సమావేశానికి నేతలు



భిక్కనూరు : కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి భిక్కనూరు మండలం నుంచి నేతలు కార్యకర్తలు ఆదివారం భారీగా తరలివెళ్లారు.

బస్తీమే సవాల్.. కుస్తీమే కమాల్



బిచ్కుందలో కుస్తీ పడుతున్న మల్లయోధులు



కొర్పోల్‌లో..



దుర్కిలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని దుర్కి, మిర్జాపూర్, సంగం గ్రామాల్లో ఆదివారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన మల్లయోధులు సందడి చేశారు. కొబ్బరి కాయ కుస్తీ నుండి రూ.1000, రూ.2 వేల వరకు కుస్తీలను నిర్వహించారు. మట్టి కుస్తీలో గెలుపొందిన వారికి కమిటీ సభ్యులు బహుమతులు అందించారు.

బిచ్కుంద(జుక్కల్) : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని బండాయప్ప మఠం ఆధ్వర్యంలో ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. మఠం పీఠాధిపతి శ్రీ సోమలింగ శివాచార్యులు మల్లాయోధులతో పరిచయం చేసుకొని కుస్తీ పోటీలను ప్రారంభించారు. మహారాష్ట్ర, కర్ణాటక హనేగాం, దెగ్లూర్, ఔరాద్, నారాయణ్‌ఖేడ్ ఆయా మండలాల మల్లాయోధులు కుస్తీపోటీలలో పాల్గొన్నారు. మఠం పీఠాధిపతి మాట్లాడుతూ కుస్తీ పోటీలతో స్నేహభావం పెంపొందించడమే కాకుండా దేహధారుఢ్యానికి ఉపయోగపడతాయని అన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొర్పోల్‌లోని హరిహర దేవాలయం వద్ద ఆదివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టెంకాయ కుస్తీ నుంచి నాలుగు తులాల వెండి కడెం వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. గెలిచిన కుస్తీ వీరులకు నగదు బహుమతులందజేశారు. చివరి కుస్తీ వీరుడికి 4 తులాల వెండి కడెంను అందజేశారు.

అడివిలింగాలలో..

ఎల్లారెడ్డి : మండలంలోని అడివిలింగాల గ్రామంలో ఆదివారం కుస్తీ పోటీలను నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా గ్రామంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. కుస్తీ పోటీలకు చుట్టు పక్కల మండలాలకు చెందిన మల్లయోధులు కుస్తీలు పట్టారు. కొబ్బరికాయ నుంచి వెండి కడియం వరకు కుస్తీ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శివాగౌడ్, ప్రతాప్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీరో విద్యుత్ బిల్లుల జారీ



శేఖాపూర్‌లో జీరో విద్యుత్ బిల్లును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మద్నూర్(జుక్కల్) : మండలంలోని శేఖాపూర్‌లో ఆదివారం గ్రామస్తులు జీరో బిల్లులను చూపిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు యాదవ్ మాట్లాడుతూ గృహజ్యోతి పథకంలో జీరో బిల్లు ఇస్తూ వినియోగదారులకు వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): గృహ జ్యోతి పథకం కింద ఇంటింటికి 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్ ఇస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల మహిళా నాయకురాలు తాటిపల్లి సరస్వతిగౌడ్ అన్నారు. ఆదివారం మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం జీపీలో గృహజ్యోతి జీరో బిల్లులను ఇంటింటికీ తిరుగుతూ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గంగారెడ్డి, రఫీ, ట్రాన్స్‌కో సిబ్బంది సాయి ఉన్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని కాటేపల్లిలో గృహజ్యోతి పథకం కింద వచ్చిన జీరో కరెంటు బిల్లును ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. మండల కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్, సింగిల్ విండో డైరెక్టర్లు గంగాగౌడ్, పెంటన్న నాయకులు పర్వయ్య షేక్ చాంద్ తదితరులున్నారు.



సింగితంలో..



కాటేపల్లిలో..

సీసీ రోడ్డు పనులు ప్రారంభం





గిర్నితండాలో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు, భూంపల్లిలో..

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని గిర్నితండా జీపీలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, జయప్రదీప్ ప్రారంభించారు. రోడ్లు, మురికి కాలువలు లేక కంపుకొడుతున్న తండాలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు నిధులు మంజూరు చేశారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సవాయిసింగ్, నాగభూషణం, మొయిన్, సంతోష్ రాథోడ్ ఉన్నారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని భూంపల్లి గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ. 10 లక్షలు కేటాయించగా ఆ నిధులతో పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంప రాజయ్య తెలిపారు. మాజీ సర్పంచ్ రవీందర్ రావు తదితరులున్నారు.

కామారెడ్డి పట్టణంలో..

కామారెడ్డి టౌన్ : పట్టణంలోని 15 వార్డులో సీసీ మురికి కాలువ పనులను కౌన్సిలర్ వనిత ఆదివారం ప్రారంభించారు. మున్సిపల్ నిధులు రూ. 5 లక్షలతో ఈ పనులను చేపడుతున్నట్లు చెప్పారు. అన్ని విధాల వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకడు రాంమోహన్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని లింగంపల్లి–బొప్పాస్‌పల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై రోడ్డు పూర్తిగా కొట్టుకుని పోయి గుంత ఏర్పడింది. ఈ రోడ్డుపై బీర్కూర్ మండలం తెలంగాణ పండరీపూర్‌గా ప్రఖ్యాతి గాంచిన ఆలయానికి, మండల కేంద్రానికి వందల సంఖ్యలో వాహనాలు వెళ్తూ ఉంటాయి. ఈ గుంత ప్రమాదకరంగా మారడంతో వాహన దారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి.

సెంట్రల్ లైటింగ్ పనులకు మోక్షం

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు పనులకు మోక్షం లభించింది. నిలిచిపోయిన పనులపై ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆర్‌అండ్‌బీ అధికారులను మాట్లాడి రీటెండర్ చేయించారు. కాంట్రాక్టర్ పని చేసేందుకు ముందుకు రావడంతో సోమవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించనున్నారు. 1.770 కి.మీ రోడ్డుకు రూ.12 కోట్లు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు అంటున్నారు. రోడ్డు వెడల్పులో దుకాణాలు ఉన్న వ్యాపారులు అభివృద్ధి కోసం సహకారం అందించాలని కోరుతున్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా ఉప్పరి రమేశ్



భిక్కనూరు : బీజేపీ భిక్కనూరు మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఉప్పరి రమేశ్‌ను నియమించారు. ఈమేరకు జిల్లా అధ్యక్షురాలు అరుణ తార ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

విలువలతో కూడిన విద్య అవసరం

బాన్సువాడ రూరల్ : విద్య అనేది కేవలం ఉద్యోగ సాధనకే పరిమితం కాకుండా విలువలు కాపాడేదిగా ఉండాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మున్వర్ జమా అన్నారు. కొయ్యగుట్టలోని మదర్సా అబ్దుల్లా బిన్ అబ్బాస్ 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన మిషన్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో ముఫ్తీ ఉమర్ బిన్ ఈసాతో కలిసి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు విద్యతోపాటు నైతిక, సాంస్కృతిక విలువలు నేర్పాలని అప్పుడే సమస్త సమాజం బాగుపడ్తుందన్నారు.



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు మున్వర్

అనంతరం హాఫీజ్ ఖురాన్ పూర్తిచేసిన విద్యార్థులను సన్మానించి బహుమతులు అందించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీఐ కృష్ణ బందోబస్తు పర్యవేక్షించారు.

సమస్యల నిలయంగా సంత



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని సంత సమస్యల నిలయంగా మారింది. మార్కెట్‌లో కూరగాయలు అమ్మడానికి ప్లాట్‌ఫాంలు లేక దుమ్ములోనే అమ్ముతున్నారు. దుమ్ముతో కూరగాయలన్నీ పాడవుతున్నాయి. అంతేకాకుండా అటు ప్రజలకు, ఇటు కూరగాయలు విక్రయించే రైతులకు, వ్యాపారస్తులకు కనీస సౌకర్యాలైన త్రాగునీటి వసతి, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రతి బుధవారం సమస్య పెద్దదిగా మారుతోందని వ్యాపరస్తులు వాపోతున్నారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని శ్రీ వాసవి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు అబాకస్‌లో ప్రత్యేకత చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఉమాకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నిజామాబాద్‌లో ఎస్‌ఎంటీ సంస్థ ఆధ్వర్యంలో అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన అంజలి, ఆనన్య, సాయి రాజ్, గోపిక, వెంకటాద్రి, శ్రద్ధ ప్రతిభ చాటి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారన్నారు. పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.



విద్యార్థులకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పార్శి కిషోర్, ఉపాధ్యక్షుడిగా శశిబాబు, కోశాధికారిగా పడకంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కాటిపల్లి లక్ష్మీపతి, ముఖ్య సలహాదారులుగా జులూరి వేణు, పార్శి వెంకటనారాయణ, పార్శిచంద్ర నారాయణ, కాశెట్టి శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజాసేవ చేస్తా



నిజాంసాగర్(జుక్కల్): జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల సేవకోసం జన చైతన్య సైకిల్ యాత్ర చేపడుతున్నానని ఎస్ఆర్ఐ మచ్చేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా మీదుగా జుక్కల్ నియోజకవర్గంలోకి జన చైతన్య సైకిల్ యాత్ర ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



మద్నూర్(జుక్కల్) : మద్నూర్, డోంగ్లీ మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. మద్నూర్ మాజీ ఉప సర్పంచ్ విఠల్, దోతి మాజీ సర్పంచ్ కాశీనాథ్‌పటేల్, మొగా మాజీ సర్పంచ్ సూర్యకాంత్, ఆయా గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలకు ఆయన బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గీత కార్మికుల కార్యవర్గం ఎన్నిక



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల గీత కార్మిక సంఘం కార్యవర్గాన్ని సీనియర్ ఇన్‌స్పెక్టర్ విష్ణు, జిల్లా సహకార అధికారి ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గీత సహకార పారిశ్రామిక సంఘం మండల అధ్యక్షుడిగా ఎస్ రాజాగౌడ్, ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, కార్యదర్శి రామచందర్‌గౌడ్, డైరెక్టర్లు నరసాగౌడ్, లక్ష్మినారాగౌడ్, నారాగౌడ్, వెంకట్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, నరేందర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవివ్వాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మైనారిటీ నాయకులు పెద్దగుట్ట దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాంకేతికపరంగా మంచి పరిజ్ఞానం ఉన్న మదన్ మోహన్‌రావుకు మంత్రి పదవిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మాజీ మండల కో–ఆప్షన్ ఇర్షాదొద్దిన్ తదితరులున్నారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలపై డీటీఎఫ్ ఖండన

కామారెడ్డి అర్బన్ : బీఆర్ఎస్ నాయకుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఉద్యోగ, ఉపాధ్యాయులపై ఇష్టారీతిన మాట్లాడితే ఊరుకునేది లేదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌సీ ప్రభాకర్, దేవులా ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒకటవ తేదీన జీతాలు తీసుకోవడాన్ని హరీశ్‌రావు జీర్ణించుకోలేక పోతున్నారని, రైతుబంధుకు, తమ జీతాలకు లింకు పెట్టిమాట్లాడడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు.

ఆధ్యాత్మికం

తిమ్మాపూర్‌లో బోనాలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని తిమ్మాపూర్‌లో బోనాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ, ఎల్లమ్మ అమ్మవార్లకు గ్రామస్తులు బోనాలను సమర్పించారు. పిల్లాపాపలు, పాడి పంటలు సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రవీందర్, అరవింద్,దామోదర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

బోనాలకు ఏర్పాట్లు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో మంగళవారం నిర్వహించే బోనాల పండగకు గ్రామ శివారులోని ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ శివారులోని పటేల్ చెరువు మైసమ్మ అమ్మవారికి బోనాల పండగలో భాగంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

శబరిమాత ఆశ్రమంలో భజనలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శనివారం రాత్రి భక్తులు భగవన్నామ సంకీర్తనలతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక భజనలు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలోని వెంకటేశ్వర, దత్తాత్రేయ, మార్కండేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రెండవ శనివారం కావడంతో తాడ్వాయి మండలం నుంచే కాకుండా మెదక్, కరీంనగర్, హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

ఘనంగా మెహెర్ బాబా వార్షికోత్సవం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కన్‌కల్‌లో అవతార్ మెహెర్ బాబా ఆలయంలో 43వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. భజనలు చేశారు. అన్నదానం నిర్వహించారు.

సావిత్రిబాయి పూలే వర్ధంతి



నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలో ఆదివారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సావిత్రిబాయి చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నీలు పటేల్, ఫిర్దోస్, సాయికిరణ్, నీరడి రాజు, బాలాజీ, ఆనంద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉర్సు



బాన్సువాడ రూరల్ : మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో గుట్టపై వెలసిన ఇబ్రాహీం భాషా దర్గా ఉర్సును ఆదివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ముతవల్లీ వసీయోద్దీన్ ఇంటి నుంచి గంధం, పూలచాదర్, నైవేద్యాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ యువకులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

దుప్పట్ల పంపిణీ



కామారెడ్డి అర్బన్ : మండలంలోని ఉగ్రవాయి గ్రామానికి చెందిన తాడ్వాయి రవికుమార్ మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం స్నేహితులు ఆదివారం అనాథ పిల్లలకు 40 దుప్పట్లు అందజేశారు. కామారెడ్డి పట్టణ శివారులోని అనాథ ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో రవికుమార్ కుటుంబసభ్యులు, స్నేహితులు, దాతలు పెద్దొళ్ల మహిపాల్, వడ్ల రవి, ఎస్.భాస్కర్, ఆశ్రమం ఇంచార్జి శోభన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

నిజాంసాగర్(జుక్కల్) : వారం రోజుల కిందట పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆదివారం స్థానిక ఎస్సై సుధాకర్ బాధితుడి దేవిసింగ్‌కు అప్పగించారు. మహమ్మద్‌నగర్ మండలంలోని కొనతండాకు చెందిన దేవిసింగ్ వారం కిందట పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ వెబ్ సైట్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బాన్సువాడ : ఆర్టీసీ కార్మికులకు 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంతో ఆదివారం బాన్సువాడ ఆర్టీసీ బస్ డిపో ఎదుట కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేశ్, పార్టీ నాయకులు అఫ్రోజ్, నార్ల రఘు, శంకర్‌గౌడ్, సుభాష్, నరేష్‌రాథోడ్, రూప్‌సింగ్ తదితరులున్నారు.

బోరుబావి పనులు ప్రారంభం



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం గ్రామం మాల మహానాడు సంఘం ఆవరణలో ఆదివారం ఆగ్రామ ఎంపీసీటీ శ్రావణీ దేవేందర్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి బోరుబావి తవ్వకం పనులు ప్రారంభించారు. బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి ఆదేశానుసారం బోరుబావి తవ్విస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో సొసైటీ డెరెక్టర్ రాణి గొబ్బురు, కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షులు సతీష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మన్నె విఠల్ తదితరులున్నారు.